ప్రజాశక్తి

శనివారం 23 మార్చి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

టిడిపి మూడో జాబితాలో

దోబూచులాట !

◆ విశాఖ ఎంపీ సీటు శ్రీభరత్‌కు ఖరారు ◆ భీమిలి అసెంబ్లీ స్థానంపై కొనసాగుతున్న ఉత్కంఠ

శ్రీభరత్ (టిడిపి విశాఖ ఎంపీ అభ్యర్థి)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు శుక్రవారం కూటమి పార్టీల తరపున విడుదల చేసిన అభ్యర్థుల మూడో జాబితా దోబూచులాటను గుర్తుకు తెచ్చేలా ఉంది. ఒకటి, రెండు జాబితాల్లో చాలా అసెంబ్లీ సెగ్మెంట్లపై స్పష్టతకు రాలేని కూటమి నేతలు తాజాగా తర్జనభర్జనలు పడిన తర్వాత కాసింత కొలిక్కి వచ్చినట్టు అర్థమవుతోంది. విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థిత్వంపై బిజెపి, టిడిపి మధ్య జరిగిన చర్చల్లో నిన్నటివరకూ ప్రతిష్టంభన కొనసాగిన సంగతి తెలిసిందే. ఇప్పటికీ ఆ టికెట్ ఆశిస్తున్న బిజెపి నాయకులు జివిఎల్.నరసింహారావు ఢిల్లీకెళ్లి మకాం వేసినట్లు తెలుస్తోంది. జివిఎల్‌కు అవకాశమిస్తే వైసిపికి సీటు ఇచ్చినట్టేనంటూ టిడిపి నుంచి బిజెపి అధిష్టానానికి సైతం ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. మొత్తానికి తర్జనభర్జనల అనంతరం ఎట్టకేలకు విశాఖ ఎంపీ సీటును గీతం విద్యాసంస్థల అధినేత భరత్‌కు కేటాయించడంతో టిడిపి శ్రేణులు ఊపిరిపీల్చుకున్నాయి. తొలి నుంచి విశాఖ ఎంపీ సీటుపై బిజెపి పట్టుబడుతూ వస్తోంది. టిడిపి నేతలు ఈ విషయాన్ని గుర్తెరిగి ఈసారి భరత్‌కు ఇవ్వకపోతే జరుగబోయే పరిణామాలకు అధిష్టానమే బాధ్యత వహించాల్సి ఉంటుందని మిగతా 2లో..

బండారుకు తొలగిన భ్రమలు

తాజా జాబితాతో టికెట్ రాదని రూఢీ - బిజెపికే అనకాపల్లి ఎంపీ స్థానం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

టిడిపి, జనసేన, బిజెపి పొత్తు చివరకు టిడిపిలో సీనియర్లకు టికెట్ లేకుండా చేసింది. శుక్రవారం టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థుల మూడో జాబితాతో ఇంతవరకు టికెట్‌పై వున్న కొద్దిపాటి ఆశ టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి పోయింది. పెందుర్తి టికెట్ జనసేనకు కేటాయించినట్లు చంద్రబాబు చెప్పినా, టికెట్ వస్తుందన్న భ్రమలో సత్యనారాయణమూర్తి ఇప్పటి వరకూ వున్నారు. తన అల్లుడైన శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఆయన చిన్నాన్న అచ్చెన్నాయుడు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కావడంతో పొత్తులో తన టికెట్‌కు వున్న ఆటంకాలు తొలగిస్తారని ఆయన నమ్మారు. కానీ అవేవీ చంద్రబాబు పొత్తుల నిర్ణయంలో మిగతా 2లో..

డ్రగ్స్ కేసును సిబిఐనే దర్యాప్తు చేస్తోంది

◆ స్థానిక పోలీసుల పాత్ర ఏమీ లేదు

◆ మీడియాతో విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

వార్త 2లో..

డ్రగ్స్ రాకెట్‌పై చర్యలు తీసుకోవాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 25 వేల కిలోల డ్రగ్స్ విశాఖలో పట్టుబడిన నేపథ్యంలో ఆ రాకెట్‌పై సమగ్ర దర్యాప్తు జరపాలని, దిగుమతికి పాల్పడిన డ్రగ్ మాఫియాను కఠినంగా శిక్షించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్ సంస్థకు చెందిన వారిని ఇప్పటివరకూ అరెస్ట్ చేయకపోవడంతో అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. అలాగే ఆ సంస్థకు టిడిపి, బిజెపి, వైసిపిలతో సంబంధాలు ఉన్నట్లు ప్రస్తుతం ఆయా పార్టీల విమర్శలను బట్టి తెలుస్తోందన్నారు. ఈ నెల 16న కంటైనర్ విశాఖ వచ్చినప్పటికీ 21 వరకూ ఎందుకు ప్రకటన చేయలేదని, దీని వెనుక బలమైన రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. అందుకనే ఇప్పటివరకు సమగ్రమైన సమాచారాన్ని బహిర్గతం చేయకపోవడంతో పాటు ఎవ్వరినీ అరెస్ట్ చేయలేదని తెలిపారు. ఈ వైఖరిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తక్షణం సమగ్ర మిగతా 2లో..

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి

వార్త 7లో..

కష్టపడేవారికి గుర్తింపు : గంటా

వార్త 2లో..

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

వార్త 4లో..

నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్మికులు

సిఎఎపై నిరసనలు

రద్దు చేయాలని సిపిఎం డిమాండ్

వార్తలు 8లో..

నేటి నుంచి హోలీ ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హోలీని పురస్కరించుకుని సికింద్రాబాద్ - సంత్రాగచ్చి మధ్య రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 07645 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి హోలీ ప్రత్యేక రైలు 23న రాత్రి 21.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09:35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 09:40 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 00.05 గంటలకు సంత్రాగచ్చికి చేరుకుంటుంది. 07646 సంత్రాగచ్చి - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు 25న ఉదయం 05.45 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి అదే రోజు రాత్రి 19:35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 19:40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:08 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెర్హంపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, జగ్డాగ్‌హర్ రోడ్, బలాక్‌జపూర్, కటక్ మీదుగా ప్రయాణిస్తాయి.

నేడు, రేపు ఉమెన్ కార్డియాక్ కేర్ జాతీయ సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా 16వ ఉమెన్ కార్డియాక్ కేర్ జాతీయ సదస్సును ఈ నెల 23, 24 తేదీలలో విశాఖ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు ఉమెన్ ఇన్ కార్డియాలజీ అండ్ రిలేటెడ్ సైన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుజాత విప్పర్ల తెలిపారు. దసపల్లాలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సదస్సుకు 300 నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతారని, దేశ, విదేశాల నుంచి ప్రఖ్యాత మహిళా కార్డియాలజిస్టులు, పరిశోధకులు హాజరై అభిప్రాయాలు వెల్లడిస్తారని తెలిపారు. గుండె మార్పిడి చేసుకోవడానికి, సంచలనాత్మకమైన పరిశోధనలు అందించడానికి మిగతా 2లో..

ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలుచేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలుచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆర్‌ఒలకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి లబ్ధిదారులకు జారీ చేసే అర్హత పత్రాలు, శిలాఫలకాలలో ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర రాజకీయ ప్రతినిధుల ఫొటోలుగానీ, వారి సందేశాలుగానీ ఉండరాదని అన్నారు. విద్యుత్, తాగునీరు, ఇతర బిల్లులపై కూడా ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర రాజకీయ ప్రతినిధుల ఫొటోలుగాని, వారి సందేశాలుగానీ ఉండరాదని తేల్చిచెప్పారు. ఎన్నికల షెడ్యూలుకు ముందు జారీచేసిన లబ్ధిదారుల ధ్రువపత్రాలు, శిలాఫలకాలపై ప్రచురించబడిన ఫొటోలు, రాజకీయ ప్రతినిధుల సందేశాలపై ఎటువంటి జోక్యమూ అవసరం లేదని, ఈ విషయం ఎన్నికల ప్రవర్తనా నియమావళి మాన్యువల్‌లోని పేరా 9.6.1లో స్పష్టం చేయబడిందని ఆ ప్రకటనలో వివరించారు.

మొదటి పేజీ తరువాయి..

దోబూచులాట !

బాహటంగానే చెప్పేశారు. మొత్తానికి భరత్‌కు ఎంపీ అభ్యర్థిగా అవకాశం దక్కడం, ఈ పార్లమెంట్ పరిధిలోగల విజయనగరం జిల్లా శృంగవరపు కోటకు సంబంధించి మాజీ ఎంఎల్ఎ కోళ్ల లలిత కుమారికి టిడిపి అవకాశం ఇవ్వడం వంటి అంశాలు ఆ పార్టీ శ్రేణులకు ఊరట కలిగించినట్లయింది.

తేలని భీమిలి

విశాఖ పార్లమెంట్ స్థానం తేలితేగానీ భీమిలి అసెంబ్లీ తేలదన్న వాదనలతో టిడిపి శ్రేణులు ఇంతవరకూ ఉన్నాయి. ఈ సీటు విషయంలోనూ టిడిపి అధిష్టానం దోబూచులాట ప్రదర్శిస్తూ వస్తోంది. బిజెపి ప్రమేయం లేకుండానే కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన పార్లమెంట్ సీటును భరత్‌కు ఇచ్చేశాయన్న వాదన కూడా మరోవైపు వినిపిస్తోంది. భీమిలి టికెట్‌పై ఇప్పటికే గంటా శ్రీనివాసరావు కన్నేశారు. ఆయనకు ఇక్కడ కాకుండా విజయనగరం జిల్లా చీపురుపల్లి ఇవ్వాలని టిడిపి అధిష్టానం పట్టుదలతో ఉన్నా గంటా ససేమిరా అనడంతో భీమిలి టికెట్ ప్రకటన ఇంతవరకూ జాప్యం చేస్తూ వచ్చారు. చివరకు విశాఖపట్నం ఎంపీ స్థానాన్ని భరత్‌కు ఇవ్వడం ద్వారా భీమునిపట్నం అసెంబ్లీ సీటును గంటాకు లైన్‌క్లియర్ చేసి టిడిపి అధిష్టానం ఉంచినట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి, వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి కొన్నాళ్లుగా నియోజకవర్గంలో ప్రచారంలో ముందున్నారు. ఆయన్ని ఢీకొట్టగలిగేది గంటానేనన్న అభిప్రాయం పలువురిలో వ్యక్తమవుతోంది. అనకాపల్లికి చెందిన హైదరాబాద్‌లో స్థిరపడ్డ వ్యాపారవేత్త, బైరా ఫౌండేషన్ అధినేత బైరా దిలీప్ చక్రవర్తికి భీమిలి టికెట్ వచ్చే అవకాశముందని వార్తలొస్తున్నాయి. ఆయన మూడేళ్లుగా అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ టిడిపి, జనసేనలకు దగ్గరగా ఉంటూ వస్తున్నారు. ఆయన పేరూ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

బండారుకు తొలగిన భ్రమలు

చెల్లుబాటుకాలేదు. యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాలు జనసేనకు కేటాయింపుపై ఆ నియోజకవర్గ టిడిపి నాయకత్వం నుంచి వచ్చిన ఒత్తిళ్లను సైతం బాబు లెక్కచేయలేదు. దీంతో ఇప్పటికీ అసంతృప్తి రాజుకుంటోంది తప్ప తగ్గడంలేదు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఇలావుంటే అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపికి కేటాయించడంతో మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు సహ టిడిపి నాయకులు అయిష్టంగా వున్నారు. విశాఖపట్నం ఎంపీ టికెట్ బిజెపికి కేటాయించి, అనకాపల్లి టిడిపి తీసుకోవాలని ఒక దశలో చంద్రబాబు ప్రయత్నించినట్లు తెలిసింది. అందుకనే... భరత్‌కు రెండో జాబితాలో చోటు దక్కలేదు. బిజెపి రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్‌కు విశాఖపట్నం ఎంపీ టికెట్ ఇవ్వడానికి బిజెపి అంగీకరిస్తే, ఈ నియోజకవర్గం బిజెపికి వదిలిపెట్టి, అనకాపల్లి టిడిపి తీసుకోవాలన్న ఆలోచనలో చంద్రబాబు వున్నారు. అయితే, విశాఖపట్నం నుంచి రాజ్యసభ సభ్యుడు జివిఎల్.నరసింహారావు పోటీచేయడానికి పట్టుబట్టారు. బిజెపి స్థానిక నాయకుల అంతర్గత కలహాలతో సిఎం రమేష్‌కు టిక్కెట్ రాదని గ్రహించిన చంద్రబాబు విశాఖపట్నం టిడిపి ఎంపీ అభ్యర్థిగా భరత్‌ను ప్రకటించారు. తనకు అత్యంత సన్నిహితుడైన సిఎం రమేష్‌ను విశాఖ నుంచి బిజెపి తరపున బరిలో దించాలన్న చంద్రబాబు ప్రయత్నాలు ఫలించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అనకాపల్లిని బిజెపికి వదిలేసి, విశాఖపట్నం టిడిపి తీసుకుంది. అనకాపల్లి టికెట్ సిఎం రమేష్‌కు బిజెపి ఇవ్వనుంది. ఆయనకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని టిడిపి ప్రధాన నాయకత్వంతో సంబంధాలున్నాయి. ఈ క్రమంలో సిఎం రమేష్ విజయానికి టిడిపి నాయకత్వం పనిచేస్తుందన్న అభిప్రాయం చంద్రబాబులోనూ, బిజెపి నాయకత్వంలోనూ వుంది. అందుకని అనకాపల్లి నుంచి రమేష్‌ను బిజెపి బరిలోకి దించనుంది.

డ్రగ్స్ రాకెట్‌పై చర్యలు తీసుకోవాలి

దర్యాప్తు జరిపి ఈ డ్రగ్ మాఫియాతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విశాఖ కంటైనర్ యాజమాన్యాన్ని కూడా ప్రాసిక్యూట్ చేయాలన్నారు. కంటైనర్ టెర్మినల్‌ను ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టడం వల్లే ఈ డ్రగ్స్ యథేచ్ఛగా దిగుమతి అవుతున్నాయని తెలిపారు. తక్షణం కంటైనర్ టెర్మినల్‌ను విశాఖ పోర్టు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశాంత విశాఖ నగరాన్ని డ్రగ్స్ కేంద్రంగా పాలక రాజకీయ పార్టీలు మార్చేశాయని విమర్శించారు. ఈ పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

నేడు, రేపు ఉమెన్ కార్డియాక్ కేర్ జాతీయ సదస్సు

కార్డియోవాస్కులర్ మెడిసిన్‌లో వచ్చిన తాజా పురోగతిని చర్చించడానికి ఈ సమావేశం దోహదపడుతుందన్నారు. ఈ సదస్సు ఎపిలో విశాఖపట్నంలో నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. మహిళల్లో హృదయ సంబంధ వ్యాధుల గురించి అవగాహన పెంచడం మహిళా రోగుల సంరక్షణను మెరుగుపరచడం తమ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరూ హృదయ సంబంధ వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని వెల్లడించారు. ఈ కాన్ఫరెన్స్ మూలంగా కార్డియాలజీ సంబంధిత శాస్త్రాలలో మహిళలు మరింత రాణిస్తారన్నారు. జపాన్, కెనడా, యుకె, సౌదీ అరేబియా, బంగ్లాదేశ్, యునైటెడ్ స్టేట్స్ అంతర్జాతీయ అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్‌గా కంచర్ల అచ్యుతరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ అధినేత, ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచర్ల అచ్యుతరావు ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఏప్రిల్ 12న విశాఖలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్, టివి, జూనియర్ ఆర్టిస్టు యూనియన్ అధ్యక్షులు జెఎంఆర్.నెహ్రూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రగ్స్ కేసును సిబిఐనే దర్యాప్తు చేస్తోంది

స్థానిక పోలీసుల పాత్ర ఏమీ లేదు
మీడియాతో విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్‌లో పట్టుబడ్డ డ్రగ్స్‌కు సంబంధించిన కేసును సిబిఐనే దర్యాప్తు చేస్తోందని, ఆ కేసుకు సంబంధించి స్థానిక పోలీసుల పాత్ర ఏమీ లేదని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం పోలీస్ కమిషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రెజిల్ నుంచి సంధ్య మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ పేరున డ్రగ్స్‌తో కూడిన కంటైనర్ విశాఖ వచ్చిందని, ఇంటర్ పోల్ సమాచారంతో సిబిఐ, కస్టమ్స్ అధికారులు గుర్తించారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సిబిఐ వారు డాగ్ స్క్వాడ్ బృందం కావాలని తమను కోరగా తాము అందించామన్నారు. అంతకుమించి ఈ కేసులో నగర పోలీసు అధికారుల పాత్ర లేదని తెలిపారు. జరిగిన కాలయాపనను కప్పిపుచ్చేందుకే ఎఫ్ఐఆర్ అలా రాసి ఉంటారని ఆయన అన్నారు. విశాఖలో మాదక ద్రవ్యాల మీద ఉక్కుపాదం మోపుతున్నామేగానీ సిబిఐ విధి నిర్వహణకు ఏ విధమైన అడ్డు తమవల్ల కలగలేదన్నారు. మాదక ద్రవ్య రవాణాదారులు విశాఖను రవాణా కేంద్రంగా వాడుకుంటున్నారే తప్ప ఇక్కడ మాదక ద్రవ్యాల వినియోగం లేదని అన్నారు.

డాక్టర్ రమణమూర్తితో ఎమ్మెల్యే వాసుపల్లి భేటీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని కళ ఆసుపత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ రమణ మూర్తిని సత్కరించి అభినందించారు. కాసేపు భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రమణమూర్తి సహకారం కోరారు. ప్రస్తుతం దక్షిణంలో వైసిపి పరిస్థితి, ప్రజల ఆదరణ తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా వార్డుల వైసిపి అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రమణమూర్తిని సత్కరిస్తున్న వాసుపల్లి

కష్టపడే వారికి గుర్తింపు : గంటా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెలుగుదేశం పార్టీ ప్రతి ఒక్కరినీ గుర్తిస్తుందని మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి విశాఖ పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పోలమరశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జరిగిన సమావేశంలో గంటా మాట్లాడారు. సామాన్య కార్యకర్తలకు కూడా టిడిపిలో గుర్తింపు లభిస్తుందని చెప్పేందుకు పోలమరశెట్టి శ్రీనివాసరావు సాక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, బిజెపి మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, చిక్కాల విజయబాబు, కార్పొరేటర్లు గొలగాని వీర రావు, దాడి వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు. పోలమరశెట్టి శ్రీనివాసరావు తో గంటా ప్రమాణ స్వీకారం చేయించారు.

జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జర్నలిస్టుల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో తలపెట్టిన క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఇటువంటి క్రీడా పోటీల వల్ల శారీరక దేహదారుఢ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతాయన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జెసాప్ సంయుక్త కార్యదర్శి వాల్మీకి నాగరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి టోర్నీలు మరిన్ని జరగాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో విశాఖ జర్నలిస్టుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రామకృష్ణ, కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

ఇఎస్ఎఎఫ్ఎస్ఎఫ్‌బి, కేర్ మధ్య ఎంఒయు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇఎస్ఎఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్పొరేట్ ఏజెన్సీ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ద్వారా వినియోగదారులకు విస్తృత శ్రేణిలో ఆర్థిక పరిష్కారాలను అందించాలనే లక్ష్యం దిశగా ముందడుగు వేశాయని ఇఎస్ఎఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎమ్‌డి కె.పాల్ థామస్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఎమ్‌డి అనూజ్ గులాటి తెలిపారు. సిరిపురంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అనూజ్ గులాటి మాట్లాడుతూ ఈ ఒప్పందం తమ ఉత్పత్తి శ్రేణిని విస్తరించడానికి దోహదపడుతుందని తెలిపారు. పాల్ థామస్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా వినూత్నమైన ఆరోగ్య బీమా పరిష్కారాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

విశాఖ మార్కెట్‌లోకి

మహీంద్రా ఎక్స్ యూవీ 400 ప్రో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ సంస్థ శుక్రవారం తన శ్రేణి నుంచి ఎక్స్ యూవీ 400 ప్రోను విశాఖపట్నం మార్కెట్‌లోకి విడుదల చేసింది. బీచ్ రోడ్డులోని ఓషన్ విస్టా హోటల్‌లో నిర్వహించిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆటోమేటివ్ మ్యాను ఫ్యాక్చరర్స్ సిఒఒ సిహెచ్. శ్రీనివాసరెడ్డి, జిఎం బి.శ్రీనివాస్, నియోన్ మోటార్స్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ, మహీంద్ర ఫైనాన్స్ హెడ్ రాజ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ నూతన ప్రో వాహనం మూడు కొత్త వేరియంట్‌లలో అందుబాటులో ఉందని తెలిపారు. ఎక్స్ యూవీ 400, ఈసీ ప్రో, ఈఎల్ ప్రో వేరియంట్లలో ఇది లభిస్తుందని వెల్లడించారు. ఒక్కొక్కటీ అధునాతన ఫీచర్లు కలిగి ఉందన్నారు. వాటి ప్రత్యేకతలను వివరించారు. ఎక్స్ యూవీ 400 ఈసీ ప్రో రూ.15,49,000కు, ఈఎల్ ప్రో వేరియంట్ రూ.16,74,000కు, ఈఎల్ ప్రోలో మరో వేరియంట్ రూ.17,49,000 ఎక్స్-షోరూమ్ ధరకు లభిస్తుందన్నారు.

కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న అతిథులు

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P.16/2024

Between:
Sri Chilukuri Satya Srinivas, S/o. Lakshmi Narayana, Hindu, aged 66 years, R/at D.No.18-103/4, Aditya Nagar, GVMC, Ward No.5, Madhurawada, Visakhapatnam.
...Petitioner

And:
1) Kucherlapati Satyanarayana Raju, S/o. Late Padmanabha Raju, Hindu, 66 years, R/at D.No.18-98, Aditya Nagar, GVMC, Ward No.5, Madhurawada, Visakhapatnam.
2) Nakka Vishnumurthy, S/o. N. Dhanaraju, Hindu, 59 years, R/at. H.No. 5-61, Nakkavanipalem, Penugonda (M), Sidhantham, W.G.Dist-534326.
3) Naveed Ahmed Shaik, S/o. Noor Ahmed Pasha, aged about 30 years, R/at D.No.3-11-1, Kandukuri Vari Street, Ram Nagar, Nidadavolu, W.G. Dist-534301.
4) Veerabhadra Praveen Kumar, S/o. V. Ratnakar Rao, Hindu, 38 years, R/at. D.No.27-3/1187, Saraswathi Nagar, Nellore-524002.
5) Kalakatla Siva Kumar, S/o. Damodharaiah, Hindu, 42 years, R/at Macharlavanipalem, T.P. Guduru, Nellore-524311.
6) Koorapati Prashanth, S/o. K.Madhusudana Choudary, Plot No.128,Greenways Road, Raja Annamalaipuram, Opp. to State Human Rights Office, Chennai, Tamilnadu-600028.
7) Gopidala Venkata Surya Satyanarayana, S/o. Late Narayana Rao, Hindu, 46 years, working in Visakhapatnam Port Trust, Emp.No.151270 CP 2 T.M. Dept TM Rlys VPT, Visakhapatnam.
8) Kambapu Satyanarayana Reddy @ Reddy, S/o. Pothuraju, 52 years, Reddy by caste, Flat No.301, Nimish Happy Home, Marripalem, Vuda Layout, near PF House, Marripalem,Visakhapatnam.Working as Chargeman in Coak Oven, Steel Plant, Visakhapatnam.
...Respondents 1 to 8

GENERAL NOTICE

The public are hereby informed that the above petitioner filed the above I.P.16/2024 on the file of the Hon'ble II Addl. Senior Civil Judge Court, at Visakhapatnam to declare him as an insolvent and the matter stands posted to **18-04-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **18-04-2024** either in person or through an Advocate at **10:30 A.M.**
(As per the Order of the Hon'ble II Addl. Senior Civil Judge Court at Visakhapatnam)
K. APPA RAO, Advocate
Visakhapatnam, Cell: 9440320923.

ఆదుకోవాలని నిర్వాసితుల వినతి

ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బెహరా

ప్రజాశక్తి -గోపాలపట్నం : రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతున్న తమను ఆదుకోవాలని జివిఎంసి 91వ వార్డు లక్ష్మీనగర్ నిర్వాసితులు కోరారు. జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుతో కలిసి వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. వినతిపత్రం అందజేశారు లక్ష్మీనగర్‌లో రోడ్డు విస్తరణను 80 అడుగుల నుంచి 40 అడుగులకు కుదించాలని, రోడ్డు విస్తరణలో ఇల్లు, ఆస్తులను కోల్పోతున్న బాధితులు నగదు రూపేణా ముందుగానే నష్టపరిహారం చెల్లించాలని, పాక్షికంగా, పూర్తిగా ఇంటికి నష్టం జరిగితే నాలుగు రెట్లు టిడిఆర్ ఇప్పించాలని, ఇళ్ల మరమ్మతులకు సింహాచలం దేవస్థానం ఇబ్బందులు ఇబ్బందులకు పెట్టకుండా జివిఎంసి ద్వారా అనుమతులు ఇప్పించాలని, పూర్తిగా ఇళ్లుకోల్పోయిన బాధితులకు వేరొక చోట ఇంటిస్థలం ఇప్పించాలని కోరారు. దీనిపై ఆనంద్‌కుమార్ స్పందిస్తూ, రోడ్డు విస్తరణలో నష్టపోయిన నిర్వాసితులకు సంబంధిత అధికారులతో సంప్రదించి అన్ని విధాలా న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బండి దుర్గేష్, తెలుకల రమేష్, ఉమామహేశ్వరరావు, ఐ శ్రీనివాస్, కె.రాజు, డి వెంకట్, శ్రీను కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థులు ఆరవ తరగతి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని సమగ్ర శిక్ష ఎపిసి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక కెజిబివిని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాలని సూచించారు. టెన్త్ విద్యార్థినులు పరీక్షలు బాగా రాస్తుండడంపై అభినందించారు. కార్యక్రమంలో సిబిఐ అధికారి నాగవల్లి, ప్రిన్సిపల్ గంగాకుమారి పాల్గొన్నారు

సందీప్‌కు భీమిలి టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి అసెంబ్లీ టిక్కెట్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పంచకర్ల సందీప్‌కు ఇవ్వాలని జివిఎంసి రెండో వార్డు పార్టీ అధ్యక్షులు ఎస్.శంకరరెడ్డి కోరారు. ఈ మేరకు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను అభ్యర్థించారు. ప్రజాసమస్యలపై సందీప్ నిరంతరం పోరాడారని, అధికార పార్టీ నుంచి ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొన్నారన్నారు.

కెకె లైన్‌లో రైళ్ల నియంత్రణ

విశాఖ కిరండూల్ రైలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : భద్రతా కారణాల దృష్ట్యా, కెకె లైన్‌లో రైళ్లు దంతేవాడలో షార్ట్ టెర్మినేట్ చేయబడతాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈ క్రమంలో 18514 విశాఖపట్నం-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు, 08551 విశాఖపట్నం-కిరండూల్ రైళ్లు ఈనెల 22 నుంచి 30 వరకు దంతేవాడ వద్ద షార్ట్ టెర్మినేట్ చేయబడతాయన్నారు. అదే విధంగా 18513 కిరండూల్, విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు కిరండూల్‌కు బదులుగా మార్చి 23 నుండి 31వరకు దంతెవాడ నుండి విశాఖపట్నం వరకు బయలుదేరుతుంది. 08552 కిరండూల్-విశాఖపట్నం రైలు కిరండూల్‌కు బదులుగా మార్చి 23 నుండి ఏప్రిల్ వరకు ఒకటో తేదీ వరకు దంతెవాడ నుండి బయలుదేరుతుంది. కావున ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డిసిఎం ఎ.కె.త్రిపాఠి అభ్యర్థించారు.

202 మంది గీతం విద్యార్థులకు ఉద్యోగాలు

ఉద్యోగాలకు ఎంపికైన గీతం విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు 202మందికి క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు లభించాయి. రెండు రోజులుగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్), క్యాప్ జెమిని నిర్వహించిన ప్రాంగణఎంపికలు నిర్వహించినట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల శుక్రవాం వెల్లడించారు. క్యాప్ జెమిని సాఫ్ట్‌వేర్ 90 మంది విద్యార్థులను ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపిక చేసుకోగా, టిసిఎస్ 112 మంది విద్యార్థులను అసిస్టెంట్ సిస్టమ్ ఇంజనీర్ ఉద్యోగాలను ఆఫర్ చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన గీతం విద్యార్థులకు రూ.4.25లక్షల నుంచి రూ.11 లక్షల వరకు వార్షిక వేతనం లభించనుందన్నారు. డెల్లాయిట్, ఐబిఎమ్, మూసిగ్మా, ప్యూచర్ ఫస్ట్, బోష్, మైక్రాన్, హుండాయ్, టాటా ఎలాక్సి వంటి మరికొన్ని ప్రముఖ సంస్థలు గీతం విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు జరపడానికి ఆసక్తి కనబరిచాయని వెల్లడించారు. అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగాలు సాధించడానికి గీతం జిసిజిసి ఇచ్చిన శిక్షణ, వ్యక్తిత్వ వికాస తరగతులు, సాంకేతిక సదస్సులు, నమూనా ఇంటర్వ్యూలు, హ్యాక్ పోటీలు ఉపయోగపడ్డాయని తెలిపారు.ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ అభినందించారు. జిసిజిసి డిప్యూటీ డైరక్టర్ ఎ.వెంకటేష్ ఉన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన

మాట్లాడుతున్న హెల్త్‌వర్సిటీ విసి ప్రొఫెసర్‌బాబూజీ

ప్రజాశక్తి -మధురవాడ: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్సర్)లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ఆర్ హెల్త్‌వర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబూజీ, విశాఖ టిబి. కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ సి హెచ్. ఫణీంద్రబాబు, విశాఖ ఛాతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. సునీల్ కుమార్, జిమ్సర్ ప్రొవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, జిమ్సర్ శ్వాసకోశ వ్యాధుల విభాగం అధిపతి డాక్టర్ సాంబశివరావు, జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు పాల్గొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ టిబి వ్యాప్తి పట్ల అవగాహన ఉండాలని, నివారణకు కృషి చేయాలని సూచించారు. జిమ్సర్ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ నిఖిల, డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, డాక్టర్ జి.ఇందిర, డాక్టర్ అప్పలరాజు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక సంగివలస, ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ ఆచార్యులు సున్నం సత్యశ్రీ, కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి శాస్త్రి, డాక్టర్ భార్గవ్‌ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా 'మాన్ విత్ ఎ గోల్డెన్ హార్ట్' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్యసత్య శ్రీ

విద్యార్థులు సేవా కార్యక్రమాలను కొనసాగించాలి

మాట్లాడుతున్న డాక్టర్ హరినాథ్

ప్రజాశక్తి -ములగాడ: విద్యార్థులు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఎయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, 2 ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ, బర్మా కాలనీలలో వారం రోజుల ప్రత్యేక సేవా శిబిరాల ముగింపులో మాట్లాడుతూ, సేవ చేయడం వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవాడతాయన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. యూనిట్ -1 ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గిసిల్లా, సిస్టర్ జయశీల, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి వివరించారు. అంగన్వాడీ బాలలకు స్టీలు పాత్రలను పంపిణీ చేశారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. మానవహారంగా ఏర్పడ్డారు. ఎన్ఎస్ఎస్ పిఒ ఇపిఎస్.భాగ్యలక్ష్మి సమన్వయం చేశారు

ముఖ్యులతో అమర్ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గ వైసిపి అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం పలువురు ముఖ్య నాయకులను. ప్రముఖులనుకలుసుకున్నారు.సింహగిరి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ్ ఇంటికి వెళ్లి, అక్కడ పలువురు స్థానిక నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సినీ నటుడు ప్రసన్న, ఇంటెక్ నాయకుడు మంత్రి రాజశేఖర్, పల్లా చిన్నతల్లి, రెడ్డి జగన్నాధం, డాక్టర్ కల్యాణ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆ తర్వాత యర్రా నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి మద్దతు కోరారు. ఇక్కడ సతీష్, రాపర్తి సుబ్బారావు ,వారణాసి నారాయణరావు, రాపర్తి బాబూరావు, సన్నిబాబు, ఎరం నాయుడు, మహాలక్ష్మి నాయుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్రి కోటేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు..

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి - మాడుగుల: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన సంచలనం రేపింది. శుక్రవారం ఉదయం మండలంలోని ఒమ్మలి గ్రామానికి చెందిన కర్రి కొండబాబు (28) మృతదేహాన్ని ఎం.కృష్ణాపురం సమీపంలో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. మృతుడు తండ్రి కర్రి రాజబాబు అందించిన వివరాలివి. ఒమ్మలి గ్రామానికి చెందిన కొండబాబు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తన స్నేహితులతో సరదాగా బయటకు వెళ్లిన కొండబాబు, రాత్రి నుండి ఆచూకీ లేకుండా పోయాడన్నారు. శుక్రవారం ఉదయానికి శవమై కనిపించాడు. సంఘటనాస్థలికి కొద్దిదూరంలో కొండబాబు బైక్ స్టాండ్ వేసి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ పి.దామోదరనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంలో యువకుడు మృత్యువాత

మృతుడు సంతోష్

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డు గాయత్రినగర్‌లో విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందినట్లు పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. విజయనగరం జిల్లా జామి మండలం భీమసింగి గ్రామానికి చెందిన చిల్లా సంతోష్ (26) గాయత్రి నగర్‌లో ఒక నూతన భవనంలో ప్లంబింగ్ పనులు నిర్వహిస్తున్నాడు. పనుల్లో ఉండగా విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని కెజిహెచ్‌కు పోస్టుమార్టానికి తరలించినట్లు తెలిపారు.

గాలిపటాలు ఎగరేస్తుండగా విద్యుత్ షాక్
ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి -గాజువాక : గాలిపటాలు ఎగరేస్తుండగా విద్యుత్ వైర్లకు షాక్‌తో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం గాజువాక జోగవానిపాలెంలో చోటుచేసుకుంది. వివరాలివి. జోగవానిపాలెం కాలనీకి చెందిన ఏడవ తరగతి చదువుతున్న చందు, గణేష్ అనే ఇద్దరు విద్యార్థులు ఒంటిపూట బడులు కావడంతో శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత గాలిపటాలు ఎగరేస్తుండగా, మేడ మీద ఉన్న కరెంటు వైర్లుకు తగిలి షాక్‌తో అక్కడి నుంచి నేలపై పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఇద్దరిని స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం కెజిహెచ్‌లో వీరు చికిత్స పొందుతున్నారు.

కాగిత గ్రామంలో చోరీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత గ్రామంలో పోతంశెట్టి గోవిందు ఇంటిలో గురువారం రాత్రి చోరీ జరిగిందని సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఇంటిలో ఎవరూ లేనిసమయంలో తలుపులు పగలగొట్టి, లోనికి ప్రవేశించిన దొంగలు రూ. 20 వేల నగదును చోరీ చేసినట్లు తెలిపారు.

సమన్వయంతో పనిచేద్దాం

- కెకె.రాజుకు పలువురి అభినందన

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి కేడరంతా సమన్వయంతో, సమిష్టిగా పనిచేద్దామని, అపుడే గెలుపు సొంతమౌతుందని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు కెకె.రాజును కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, వైజాగ్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామసభ్యులు పలు సంఘాల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

మామిడిపాలెంలో అభయహస్తంపై ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి- భీమునిపట్నం :కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ రాజ్యంలో పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతామని ఆ పార్టీ నాయకులు కదిరి జగన్నాథం, గాదం మహేష్ అన్నారు శుక్ర వారం స్థానిక బ్యాంక్ కాలనీ, మామిడిపాలెంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించి, ఓటేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకత్వంలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ "ఇండియా కూటమి' అధికారంలోకి రావడం ద్వారానే ఏపికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాకుండా పరిరక్షించుకోవడం సాధ్యమన్నారు. అభయహస్తం కర పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు

ఎంవిఆర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

మాట్లాడుతున్న బికాస్ కుమార్ నాయక్,

ప్రజాశక్తి- గాజువాక : నడుపూరు, రామచంద్ర నగర్ క్యాంపస్‌లోని ఎంవిఆర్ పీజీ కాలేజీలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అరబిందో ఫార్మా హెచ్ఆర్ బికాస్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు, సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తులో ఉత్తమంగా రాణించవచ్చన్నారు. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించాలన్నారు. ఎంవిఆర్ కాలేజీ పిజీ కెమిస్ట్రీ హెడ్ వై.ఈశ్వరరాజు మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్య, జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు.కార్యక్రమంలో పీజీ కోఆర్డినేటర్ తేజేశ్వరరావు, మైక్రో బయాలజీ హెడ్ పివిడి.సౌజన్యకుమారి, ప్రిన్సిపల్ బాలకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో

బుల్లయ్య కాలేజీ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ సెక్రటరీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తరప్రదేశ్ మీరట్‌లోని స్వామివివేకానంద సుభార్తీ యూనివర్సిటీలో నిర్వహించిన ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ మహిళల, పురుషుల ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానికడాక్టర్ లంకపల్లి బుల్లయ్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. డిగ్రీ ఫస్టియర్ విద్యార్థిని బి.ఆశ్రిత 50 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. బిఎస్‌సి ఫస్టియర్ విద్యార్థి కె.పద్మేరాజ్ 63 కేజీల విభాగంలోకాంస్య పతకాన్ని సాధించాడు. వీరిని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె. చక్రవర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సోమేశ్వర్ రెడ్డి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్ లక్ష్మణరెడ్డి అభినందించారు.

జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

● వివిధ పదవులకు 55 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు నామినేషన్ ఘట్టం శుక్రవారంతో ముగిసింది గడువులోగా వివిధ పోస్టులకు 57 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి కె.నరసింహమూర్తి తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి బెవరా సత్యనారాయణ, తాళ్లూరి రవికుమార్, సన్నీ యాదవ్, ఐఎం మహమ్మద్ నామినేషన్ దాఖలు చేయగా, ఉపాధ్యక్ష పదవికి ఏడు నామినేషన్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ స్టేట్ సెక్రటరీ, విశాఖపట్నం యూనిట్ జనరల్ సెక్రెటరీ సూకల వెంకటేశంతో పాటు మరో ఐదుగురు నామినేషన్లు వేశారు. సంయుక్త కార్యదర్శి పదవికి ఇద్దరు, కోశాధికారికి నలుగురు, స్పోర్ట్స్ సెక్రెటరీ పదవికి నలుగురు నామినేషన్లను దాఖలు చేశారు. ప్రతిసారీ ఏకగ్రీవమైన లేడీస్ రిప్రజెంటేటివ్ పదవికి తాజా ఎన్నికల్లో ఇద్దరు నామినేషన్లు వేశారు. జూనియర్ సభ్యులుగా 16 మంది.. 20ఏళ్ల సీనియర్ సభ్యులుగా ఇద్దరు, 30ఏళ్ల సర్వీసు పైబడిన కేటగిరీ సభ్యులుగా ఇద్దరు నామినేషన్లు వేశారని ప్రధాన ఎన్నికల అధికారి కె.నరసింహమూర్తి సహాయ ఎన్నికల అధికారులు ఎంకెఎస్ శ్రీనివాస్, బండి ప్రభాకర్ తెలిపారు. 25న సోమవారం నామినేషన్ల పరిశీలన, 26,27తేదీల్లో ఉపసంహరణలు, 28న పోటీ అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామన్నారని ఎన్నికల అధికారి తెలిపారు.

నామినేషన్లు దాఖలు చేస్తున్న న్యాయవాదులు

కొండయ్యకు చీరాల టిడిపి టిక్కెట్‌పై హర్షం

కేకు కట్ చేస్తున్న కొండయ్య అభిమానులు

ప్రజాశక్తి -గాజువాక : చీరాల అసెంబ్లీ నియోజకవర్గం జనసేన, బిజెపి, టిడిపి కూటమి అభ్యర్థిగా ఎంఎం కొండయ్యకు టిక్కెట్ కేటాయించడంతో ఆయన అభిమానులు పాత గాజువాక జంక్షన్‌లో సంబరాలు చేసుకున్నారు. కొండయ్య కార్యాలయంలో అభిమానులు, కార్యాలయ సిబ్బంది కేక్ కట్ చేశారు. బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు బాలాజీ, భూషణరావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లరావు, వేణుగోపాల్, రఘుబాబు, రామ్‌కుమార్ మాట్లాడుతూ, గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో వ్యాపారపరంగా స్థిరనివాసముంటున్న చీరాల స్థానికుడైన కొండయ్యకు అక్కడ కూటమి అభ్యర్థిగా టిక్కెట్ ఇవ్వడం హర్షణీయమన్నారు.టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బిజెపి రాష్ట్రాధ్యక్షురాలు పురందరేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాము, సూర్యనారాయణ, వెంకటరావు, సాయిరాం, సత్యనారాయణ, రోజావేణి, రాజు, రమణయ్య, ఎస్మాల్ కొండయ్య పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైసిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డులోని పలు ప్రాంతాల్లో శుక్రవారం వైసిపి అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక పాత పోస్టాఫీసు నుంచి భీమిలి రోడ్డు మీదుగా కో ఆపరేటివ్ బ్యాంక్, గొల్లవీధి, ఆదర్శనగర్, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వచ్చేఎన్నికల్లో భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జివిఎంసి కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, వైసిపి నేతలు జగుపిల్ల ప్రసాద్, కొప్పల రమేష్, జి వెంకటరెడ్డి, బి.హరి కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కుల్లో వైసిపి ఎన్నికల ప్రచారం

సీతమ్మధార : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర నియోజకవర్గం 49,50 వార్డుల పరిధిలోని మురళినగర్ వాకర్స్ పార్కు, సుదర్శన్ పార్క్, ప్రశాంతి పార్కులలో వైసిపి నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి అభ్యర్థి కెకె.రాజుతోపాటు వార్డు కార్పొరేటర్లు అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్ పార్కులను సందర్శించి, అక్కడకు వచ్చిన వాకర్స్, సందర్శకులతో ముచ్చటించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాగా తాము మద్దతునిస్తామని వాకర్స్ ప్రకటించినట్లు వైసిపి నేతలు తెలిపారు. భగతి విజయ్‌కుమార్, కృష్ణారావు, అమర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న బొత్స ఝాన్సీ, ముత్తంశెట్టి

ఆనందపురం : మండలంలోని వెల్లంకి, వేములవలస, ఆనందపురం గంభీరం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు కోరాడ వెంకటరావు బంక సత్యనారాయణ, గన్‌రెడ్డి శ్రీనివాస్, కోరాడ అప్పల సోమనాయుడు, కోరాడ రాంబాబు, కాకర వెంకటరమణ ఉప్పాడ లక్ష్మణరావు, చందక లక్ష్మి సూరిబాబు మీసాల పైడిరాజు, జనగం రామారావు, బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ, పాండ్రంకి శ్రీను, పినిశెట్టి సింహాచలంనాయుడు, కోరాడ ముసలి నాయుడు, లంక రాంబాబు, ఇల్లాపు వెంకట జగన్ పాల్గొన్నారు,

వైసిపి ఎన్నికల పరిశీలకులు

చొక్కాకులకు రాజు అభినందన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకునిగా నియమితులైన చొక్కాకుల వెంకటరావును స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు శుక్రవారం అభినందించారు. పుష్పగుచ్ఛం, అందజేసి దుశ్శాలువాలతో పరస్పరం సత్కరించుకున్నారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు.కార్యక్రమంలో 14వార్డు కార్పొరేటర్ కె అనిల్ కుమార్‌రాజు పాల్గొన్నారు.

వెంకటరావును అభినందిస్తున్న రాజు

నిర్భయంగా ఓటేయండి : సిఐ

పద్మనాభంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పద్మనాభం: గత ఎన్నికల్లో ఓటింగ్‌శాతం తక్కువగా ఉన్న మండలంలోని తునివలస గ్రామపంచాయతీలో శుక్రవారం మండలస్థాయి అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పద్మనాభం సిఐ సిహెచ్.శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటేయాలని, దీనికి పోలీస్ శాఖాపరంగా భద్రతతోపాటు ఇతర శాఖల సహకారం ఉంటుందని భరోసానిచ్చారు. గతం కంటే ఓటింగ్‌శాతం మెరుగుపడాలని, ఓటు హక్కు ప్రతిఒక్కరూ ఓటేయాలని కోరారు.

అందరూ ఓటేసేలా చైతన్యవంతం చేయండి

ప్రజాశక్తి-పెందుర్తి : వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటేసేలా ఓటర్లను అవగాహన, చైతన్యంకల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శేషశైలజ అన్నారు. శనివారం ఎన్నికలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని 282 పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో భద్రతా చర్యలను పోలీస్‌యంత్రాంగం చేపడుతుందని, అయితే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను రప్పించి, వారితో ఓటేసేలా చైతన్యవంతం చేసే బాధ్యతను అధికారయంత్రాంగం చేపట్టాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వెలగపూడి

ముస్లిములతో ఇఫ్తార్ విందులో పాల్గొన్నఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 11వ వార్డు ముస్తాఫా కాలనీ మసీదులో ముస్లిములకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఇఫ్తార్ విందులో పాల్గొని, ముస్లిములతో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముగడ రాజారావు, రాగతి అచ్యుతరావు, మూది అప్పారావు, ఒమ్మి అప్పలరాజు, ఖలేషా పాల్గొన్నారు.

మహిళల నిరసన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కెకె.రాజుపై మాజీ ఎమ్మెల్యే, బిజెపి నేత విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం వైసిపి మహిళలు నిరసన చేపట్టారు. టిడిపి అధినేత చంద్రబాబు విశాఖ పర్యటనలో మహిళలతో మద్యం తాగించి, వారితో చంద్రబాబుపై గుడ్లు, టమోటాలు వేయించి కెకె.రాజు సంబరాలు చేసుకున్నారని విష్ణుకుమార్ అనడం సిగ్గుచేటని వైసిపి మహిళా విభాగం ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి పీలా.వెంకటలక్ష్మి అన్నారు. మహిళలకు విష్ణుకుమార్‌రాజు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉత్తరం నియోజకవర్గ కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

నేడు వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని వికె.పాలెం, బాంధవపురం గ్రామాల్లో శనివారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నిక ఎన్నికల ప్రచారానికి వస్తారని వైసిపి మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు

జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నియమావళి శతశాతం అమలు పరవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణస్థాయి నుండి గ్రామస్థాయి వరకు ఎక్కడా ఉల్లంఘనలకు అవకాశం ఇవ్వరాదని హితవుపలికారు. అనుక్షణం అప్రమత్తంగా వుండాలన్నారు. 9 చెక్ పోస్టుల వద్ద తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు. ఉల్లంఘనలు, డబ్బు- మద్యం, మాదక ద్రవ్యాల రవాణాలపై ఉన్నతాధికారులకు ఎటువంటి ఫిర్యాదు రాకముందుగానే చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు గూర్చి అన్నిజిల్లాల ఎన్నికల అధికారులతో సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న ఫార్మ్- 7, 8లను ఈనెల 26 నాటికల్లా పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, డి.ఆర్.ఓ. బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్‌వి.జయరామ్, డిఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, గ్రామ వార్డు ప్రత్యేకాధికారి మంజులవాణి, ఆడిట్ అధికారి గోవిందరాజులు, ఆర్టీవో ప్రకాశరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

శిక్షణను ప్రారంభిస్తున్న వెంకునాయుడు తదితరులు

జాతీయస్థాయి క్రీడాకారులకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన రగ్బీ క్రీడాకారులకు అచ్యుతాపురంలో శుక్రవారం మూడు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులను వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు కె వెంకునాయుడు ప్రారంభించారు. ఈనెల 25 నుంచి 30 వరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరగబోతున్న రగ్బీ 15 సీనియర్స్ ఎంపికైన జట్టులో రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులు అచ్యుతాపురంలో శిక్షణకు ఎంపిక చేసినట్లు చెప్పారు. మూడు రోజులపాటు శిక్షణ పొంది 24న బయలుదేరి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెంకు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలను ప్రారంభించి క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు డెంటల్ హాస్పిటల్ వైద్యులు అడిగర్ల సుధీర్, సనైజ్ డయాగ్నస్టిక్ సిహెచ్ సోమశేఖర్ సంతోష్ పాల్గొన్నారు. గుంటూరుకు చెందిన సుమంత్ టీంకి కోచింగ్ ఇవ్వబడునున్నారు. టీం మేనేజర్‌గా వెంకట్ వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ సెక్రటరీ రామాంజనేయులు జట్టు వివరాలను వివరించారు.

ఓటర్లకు చీరల పంపిణీ

- వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి -చోడవరం

చోడవరం పెద్ద బజారు వీధిలో ఓటర్లకు చీరలు పంపిణీ చేస్తుండడంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ 49 చీరలను స్వాధీనం చేసుకుని, ఎం.శ్రీకాంత్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక సీఐ బి శ్రీనివాసరావు అందించిన వివరాల ప్రకారం... చోడవరం పెద్ద బజారు వీధిలో మేడిశెట్టి శ్రీకాంత్ తన వాహనంలో వైసిపి తరఫున చీరలు పంపిణీ చేస్తున్నారని ఎన్నికల సిబ్బందికి సమాచారం వచ్చింది. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి తనిఖీలు నిర్వహించగా శ్రీకాంత్ వాహనంలో 49 చీరలు, మూడు వాణి లంగాలు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

కొణతాలకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను గెలిపించాలని కోరుతూ స్థానిక 84వ వార్డు ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యంలో కోట్నీవీధిలో, మల్ల సురేంద్ర ఆధ్వర్యంలో 81 డివిజన్ గవరపాలెం నిదానందొడ్డిలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి రామకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు కోట్ని రామకృష్ణ, కోట్ని రాంబాబు, తలారి లక్ష్మీప్రసాద్, డొంక దుర్గ నాయుడు, కరణం శ్రీనివాసరావు, దుద్దు నాగేశ్వరరావు, కోట్ని హరి, మజ్జి శ్రీనివాసరావు, సాలపు శ్రీను, ప్రసాదుల రవి, నాగిరెడ్డి మధు, దాడి అప్పారావు, ధనాల విష్ణుకుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణను గెలిపించాలి

కశింకోట : కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు కార్యకర్తలు పని చేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని గోకివానిపాలెం, మోసయ్యపేట గ్రామాల్లో శుక్రవారం బూత్ స్థాయి కమిటీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం టిడిపి నాయకులు నిమ్మదల సన్యాసి నాయుడు, నైనంశెట్టి రమణరావు, దొడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే అభ్యర్థి కొణతాల రామకృష్ణను తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంతిన శ్రీనివాసరావు శుక్ర వారం కలిశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు జెర్రిపోతల నూకినాయుడు, నారిపిల్ల ప్రసాద్ ఉన్నారు.

వైకల్య నిర్ధారణ వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోనల్ పరిధిలోని వుడ్‌పేట ప్రైమరీ పాఠశాల ఆవరణలో అలిక్రో సంస్థ ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు వికలాంగ గుర్తింపు నిర్ధారణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. 0 నుండి 18 సంవత్సరాల లోపు వయస్సు గల వికలాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు (వీల్ చైర్లు, సిపి చైర్లు, ట్రై సైకిల్స్, క్లచెస్, వాకర్స్ , రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్, వినికిడి యంత్రాలు) ఇవ్వటానికి ఈ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.శకుంతల, అనకాపల్లి ఎంఇఓ కోటేశ్వరరావు ప్రారంభించారు. పది మండలాల నుండి 107 మంది వికలాంగ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆసుపత్రి నుంచి డాక్టర్లు వై గంగాధర్, ఫరుద్దీన్, దివ్య ప్రియ హాజరై విద్యార్థులకు కావలసిన ఉపకరణాలను సిఫారసు చేశారు. చికిత్స నిమిత్తం అవసరమగు సూచనలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వుడ్ పేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు, అనకాపల్లి మండల ప్రత్యేక ఉపాధ్యాయులు బి.వి.వరప్రసాద్, రమాదేవి, యేసు రత్నం, పది మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు, వికలాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఏర్పాటులో వెంకటస్వామి కీలకపాత్ర

ప్రజాశక్తి -అనకాపల్లి

వెంకటస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీయూపీఎఫ్) ఏర్పాటు చేయడంలో సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకట స్వామి ప్రముఖ పాత్ర పోషించారని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి పేర్కొన్నారు. వెంకటస్వామి 23వ వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్ అనకాపల్లి కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏపీఎస్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయి మాట్లాడుతూ నిరాడంబర జీవితం గడుపుతూ, వందల కిలోమీటర్లు ప్రయాణించి, సంఘాన్ని విస్తృత పరిచారని, తన 14 సంవత్సరాల సర్వీస్‌ను వదిలి సంఘాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మీ మాట్లాడుతూ ఏపీఎస్ తన జీవితాన్ని సంఘానికి అంకితం చేశారని, ఉపాధ్యాయ సమాజం ఏపీఎస్‌కు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాజేష్, జిల్లా కార్యదర్శులు జిఎస్ ప్రకాష్, రమేశ్ రావు, శేషు కుమార్, సీనియర్ నాయకులు దేముడు నాయుడు, కామరాజు, రామచంద్రరావు, ఆశ, ఝాన్సీ, సలీం, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి

స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 93వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు వివి శ్రీనివాస్, ప్రస్తుత జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు ఈశ్వరరావు, ప్రస్తుత జిల్లా కోశాధికారి ఎస్ నాగ రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో యువతను, ప్రజలను భాగస్వామ్యం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. బ్రిటీష్ వలస పాలన నుంచి దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడినట్లు గుర్తు చేశారు. 23 ఏళ్ల వయస్సులోనే తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. ఆ యువకిశోరాల త్యాగనీతి నేటి తరం విద్యార్థులు, యువకులు తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. శనివారం అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవన్‌లో వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని, ఆ సభలో మొదట, ద్వితీయ, తృతీయ బహుమతులను అందిస్తామని చెప్పారు.

ఓటమి భయంతో నీచరాజకీయాలు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : రాంబిల్లి మండలం మత్స్యకార గ్రామమైన కొత్తపట్నంలో టీడీపీ కార్యకర్తలెవరూ వైసీపీలోకి వెళ్లలేదని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు నీచరాజకీయాలకు పాల్పడుతున్నారని టిడిపి మండల అధ్యక్షులు వి.దినబాబు ఆరోపించారు. కొత్తపట్నంలో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తపట్నం పంచాయతీలో రెండు దఫాలుగా సుమారు 300 మంది టీడీపీ వారు వైసీపీలో చేరినట్లు వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. బోట్లు ప్యాకేజీ, తమ వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేసేందుకు వెళ్లగా తమకు వైసీపీ నాయకులు బలవంతంగా ఆ పార్టీ కండువాలు వేశారని స్థానిక టీడీపీ నాయకులు కె.అప్పారావు, చోడిపల్లి గంగరాజు, చోడిపల్లి శ్రీను, ఎం. అప్పలరాజు, పి.అప్పారావు, సత్యారావు గణేష్ తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.రఘురాజు, చోడిపల్లి సత్యనారాయణ, ఉమ్మిడి నాగేష్, చోడిపల్లి మంగరాజు, ఉమ్మిడి అప్పలరాజు, కందాల రాజారావు, గరికిన కాసులు, యజ్జల జోగిరాజు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఎంతో మేలు

ప్రజాశక్తి-అనకాపల్లి : సేంద్రియ వ్యవసాయం ద్వారా అటు రైతులకు, ప్రజలకు ఇటు పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని సేంద్రియ వ్యవసాయం ఐసిఆర్‌పి మోడల్ మేకర్ విల్లూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని బగులవాడ, దిబ్బపాలెం, ఊడేరు గ్రామాల్లో ఎపి బయోడైవర్సిటీ బోర్డ్ గుంటూరు సహకారంతో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ మనుగడకు జీవనాధారం అయిన నీటిని భద్రపరచుకోవాలని సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే పంటలను పండించాలని, ముఖ్యంగా చిరుధాన్యాల పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఐసిఆర్‌పి కోఆర్డినేటర్ స్వాతి, ఎం నాగేశ్వరరావు, శారద వ్యాలీ డెవలప్మెంట్సమితి సంస్థ మండల కోఆర్డినేటర్లు కోన అప్పారావు, ఎఎంఎల్ కాలేజీ బిఎస్సి అగ్రికల్చర్ విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారు

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నం తనకు కలల రాజధాని అని చెబుతూ, దానిని డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, విశాఖలో పెద్ద ఎత్తున డ్రగ్స్ దొరుకుతున్నాయని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శుక్రవారం అనకాపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం డ్రైడ్ ఈస్ట్ కంటెయినర్‌లో సుమారు 25 వేల కిలోల మాదక ద్రవ్యాలను సీబీఐ ఇంటర్ పోల్ సమాచారం మేరకు పట్టుకోవడం సంచలనంగా మారిందన్నారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఉత్తరాంధ్రలో అంతులేని గంజాయి అమ్మకాలు, మద్యం అమ్మకాలు పెరిగిపోయాయని విమర్శించారు. యువత మద్యంతో పాటుగా గంజాయికి బానిసలుగా మారిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవాలు ప్రజల ముందు ఉంచాలని కోరారు. పార్టీ నాయకులు కొలసాని రమణ, రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

భరత్‌కుమార్ సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - కశింకోట : మండల కేంద్రం కసింకోట పూసర్ల వీధిలో వైసిపి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సతీమణి మలసాల నివేదిత శుక్రవారం ప్రచారం చేపట్టారు. గడపగడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన భర్త భరత్ కుమార్‌ను అత్యంత మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్ సతీమణి మలసాల అనురాధ, గ్రామ సర్పంచ్ మంత్రి రజిని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపిటిసిలు ఎల్లపు నూకరత్నం, చెవ్వేటి చంద్రమ్మ, వార్డు సభ్యులు కోమిసెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న భరత్ కుమార్ సతీమణి నివేదిత

అభివాదం చేస్తున్న టిడిపి నేతలు రాజు, తాతయ్యబాబు

అవినీతి వైసిపిని ఓడించాలి

ప్రజాశక్తి-చోడవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదింపి రాష్ట్రాన్ని కాపాడాలని, అందుకు అనుగుణంగా చోడవరం వైసిపి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని ఓడించాలని చోడవరం నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కెయస్ఎన్ఎస్.రాజు, నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, నాయకులు జి మల్లు నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో చోడవరం నియోజకవర్గంలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని, ఎక్కడ చూసినా అవినీతి పేరుకుపోయిందని ఆరోపించారు. చోడవరం నియోజకవర్గ ప్రజలు టిడిపికి ఓటేసి మంచి పరిపాలనను తీసుకురావాలనే కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, జి.వెంకట సత్యనారాయణ, గుమ్మలూరు చంద్రమౌళి, కొండమనాయుడు, బొడ్డేట నాగ గంగాధర్, సిరిగిరి శెట్టి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని అడ్డాం గ్రామ అంగన్వాడీ కేంద్రం వద్ద పోషణ పక్వాడ్ కార్యక్రమం శుక్ర వారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్ళ పాలెం సెక్టర్ సూపర్వైజర్ సుచరిత ఆదిలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆహార అలవాట్ల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతరం గర్భిణీలకు శీమంతాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఎస్ వరలక్ష్మి, బాలింతలు గర్భిణులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని రావాడ పంచాయితీ పరిధి జల్లేలపాలెం గ్రామంలో శుక్రవారం శ్రీమరిడి మాంబ అమ్మవారి నూతన ఆలయాన్ని ప్రారంభించారు. మేడిశెట్టి అప్పల నాయుడు దంపతులు పూజ చేసి పందిర రాట వేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా, ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యం, మేడిశెట్టి సోమునాయుడు, పితాని అప్పారావు, కట్టా ఆదినారాయణ, పొలవరపు గంగు నాయుడు, దొడ్డి కృష్ణారావు, పోలవరపు నాగరాజు, పితాని శ్రీను, గ్రామ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లి రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు కార్యకర్తలు నడుం బిగించాలని మాడుగుల నియోజక వర్గ టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన టిడిపి క్లస్టర్, యూనిట్, బూతు ఇన్చార్జిల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి మేనిఫెస్టోని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రొంగలి మహేష్, సబ్బవరపు రామానాయుడు, పూడి నారాయణమూర్తి, లెక్కల అవతారం, లెక్కల మల్లేశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి, ఎడ్ల రమేష్, మొల్లి గోవింద, లెక్కల చంద్రరావు, లెక్కల అప్పలనాయుడు, దొగ్గ వరాహమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావు

ధాన్యం లోడుతో వాహనం బోల్తా

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిధి కుడియ సమీపంలో ధాన్యం లోడుతో వస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ (55), కొటాన సూర్యనారాయణ, గొంప మంగునాయుడు తీవ్రంగా గాయపడ్డారు. వాహన డ్రైవర్ రవితో పాటు మరో వ్యక్తి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పినకోట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొస్తుండగా మార్గ మధ్యలో దాసరి లక్ష్మణ మృతి చెందాడు. క్షతగాత్రులకు పినకోట వైద్యాధికారి రూప్ చంద్ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ఘటన తెలిసిన వెంటనే దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర అనంతగిరి పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు.

కాశీపురం గ్రామానికి చెందిన గంగరాజు అనే వ్యక్తి కొన్నేళ్ల నుంచి అనధికారికంగా ధాన్యం వ్యాపారం చేస్తున్నారు. ఇదే క్రమంలో అనంతగిరి మండలంలోని సరసపాడు తదితర గిరిజన ప్రాంతాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకురాడానికి కాశీపురం గ్రామానికి చెందిన నలుగురు కూలీలను బొలేరా వాహనంలో శుక్రవారం వేకువ జామున 4 గంటల సమయంలో పంపించారు. ధాన్యం బస్తాల లోడు చేసుకుని తిరిగి వస్తుండగా కుడియ సమీపంలో బొలెరో వాహనానికి బ్రేకులు ఫెయిలవ్వడంతో అదుపుతప్పి బోల్తా పడిందని ప్రమాదం నుంచి బయట పడిన డ్రైవరు రవి విలేకరులకు తెలిపారు.

దాసరి లక్ష్మణ మృతదేహం

చందాకు వెళ్తే వైసిపి కండువాలు వేశారు

టిడిపి కండువాలు వేస్తున్న తెలుగు రైతు నాయకులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కశింకోట : ప్రతి ఏటా మాదిరిగా బళ్ళల పండగ కోసం వైసిపి అనకాపల్లి అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌ను గురువారం కలిశామని, మాకు బలవంతంగా వైసిపి కండువాలు వేశారని మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన రజకులు పొన్నాడ రాము, ఎస్.శివ, ఎం.గణేష్, ఎస్.అప్పారావు, ఎస్.దేముడు, ఎస్.స్వామి, దుప్పాడ శివ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారంతా తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావును కలిశారు. వారికి శ్రీనివాసరావు టిడిపి కండువాలు వేశారు. ఈ సందర్భంగా పొన్నాడ రాము మాట్లాడుతూ పండగకు చందాకు వెళ్తే కండువా వేయడం బాధ కలిగించిందన్నారు. తాము ఎప్పుడూ శ్రీనివాసరావు వెంటే ఉంటామని, పార్టీ మారే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. తెలుగు రైతు నేత శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎవరైనా ఇష్టపడి పార్టీలో చేరితే తప్పు లేదని, చందాకు వెళ్తే కండువా వేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోన మాణిక్యం, గొంతిన శివ కృష్ణ, తాడేల సూరిబాబు, నారిపిల్లి పోతురాజు, కర్రి నారాయణ రావు, పడాల అప్పలనాయుడు, నారిపిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

రక్షణ గోడలేక వాహనచోదకుల బెంబేలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని వివిధ గ్రామాల మీదుగా విశాఖ తాగునీటి అవసరాల కోసం నీరు ప్రవహిస్తున్న రైవాడ కాలువపై మదుముల వద్ద పలు చోట్ల రక్షణ గోడలు లేవు. దీంతో పలుమార్లు కాలువలో వాహన చోదకులు పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. మండలంలోని గవరపాలెం, కె.అగ్రహారం గ్రామాల వద్ద రైవాడ కాలువ మీద బ్రిడ్జిలు నిర్మించి వేసిన రోడ్డుకు రక్షణ గోడలు లేవు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించక ముందే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని రక్షణ గోడలు నిర్మించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

గవరపాలెం వద్ద కాలువ బ్రిడ్జిపై రక్షణ గోడ లేని దృశ్యం

పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించిన ఎస్‌పి

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలో పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శుక్రవారం పర్యవేక్షించారు. అనకాపల్లి, గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్, నర్సింగరావు పేట, నారాయణ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను సందర్శించి, బందోబస్తు ఏర్పాట్లును పర్యవేక్షించి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ శంకరరావు ఉన్నారు.

భూగర్భ జలాల పరిరక్షణ అందరి బాధ్యత

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ రమేష్‌కుమార్

ప్రజాశక్తి -గాజువాక

భూగర్భజలాల పరిరక్షణ అందరి బాధ్యత అని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు అంబేద్కర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి.వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సాయిరాం నగర్, గాజువాక జిల్లా పరిషత్ హై స్కూల్ మీదుగా కొత్త గాజువాక మంగళగిరి కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ కొనసాగింది. అనంతరం జెవివి జిల్లా పర్యావరణ కన్వీనర్ పాలూరి లక్ష్మణస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. డాక్టర్ రమేష్ కుమార్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె.పరశురామ్, ఉపాధ్యాయులు పద్మజ, సూర్యకుమారి, ఎస్ఆర్ లక్ష్మి, స్వర్ణ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో శుక్ర వారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు, డైట్ అధ్యాపకులు గొట్టేటి రవి మాట్లాడుతూ, జీవ రాశి, భూగోళం మనుగడ, నీటిపైనే ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. జల ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు సిఎ సోమయాజులు, ఎస్ త్రినాథరావు, హారిణి పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి, ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవం సందర్భంగా సెమినార్ నిర్వహించారు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంభుప్రసాద్ నీటి ప్రాముఖ్యత, పొదుపు గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జె.రాజమురుగదాస్, ఎన్ఎస్ఎస్ పిఒ హరిగోపాల్ , షణ్ముకేష్, సివిల్ విభాగాధిపతి పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : ఇస్కాఫ్ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమాన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అతిథులుగా నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ వి.బాల మోహన్ దాస్, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజమాణిక్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలాలు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నీటిని అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. 2040 నాటికి ప్రపంచంలో భూగర్భ జలాలు చాలావరకు తగ్గిపోయే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న తరుణంలో జలాలను సక్రమంగా వినియోగించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు సుకుమారన్, ప్రభాకర్, రాం ప్రభు, ఎం.మధుమతి, పి.సత్యవతి, సూర్యకుమారి, పావని పాల్గొన్నారు.

అనకాపల్లి : నానాటికి పెరుగుతున్న నీటి కొరత అధిగమించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల కృషి ఎంతో అవసరమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ బివికే జగన్నాధరావు అన్నారు. స్థానిక ఆర్ఎఆర్ఎస్‌లో శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నీటి కొరత పెరుగుతోందని, బెంగళూరు, చెన్నై వంటి పట్టణాలే ఉదాహరణ అని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రజలు స్వచ్ఛంద సంస్థలు దృష్టి సారించి భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు విశాలాక్షి, శ్రీలత, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా రాంబిల్లి కస్తూరిబా గాంధీ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నీటి ప్రాధాన్యతను, సంరక్షణ బాధ్యతని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి ప్రమీల మాట్లాడుతూ పర్యావరణాన్ని కలుషితం కాకుండా చూడడం, మొక్కలు నాటడం, నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు నీరు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని పి.కళ్యాణి మాట్లాడారు. నీటి వనరుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్లకార్డులతో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు.

బిజెపి కుట్రలను తిప్పి కొట్టండి

-మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి తూట్లు
-విదసం రాష్ట్ర కన్వీనర్ వెంకట్రావు

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్:రాజ్యాంగానికి బిజెపి తూట్లు పొడుస్తుందని, ఆ పార్టీ కుట్రలను తిప్పికొట్టాలని వివిధ దళిత సంఘాల ఐక్యవేదిక (విదసం) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు పిలుపునిచ్చారు. నర్సీపట్నం నవనిర్మాణ సమితి కార్యాలయంలో ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం వడ్లమూరి ఫ్రాన్సిస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బిజెపి నాయకులు చెబుతున్నారని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మారిస్తే పేద, బడుగు బలహీన వర్గాలకు నష్టం కలుగుతుందన్నారు.మణిపూర్ సంఘటనలో ఎంతో ప్రాణాలు కోల్పోవడానికి బిజెపి పార్టీ ప్రధాన కారణమన్నారు. క్రైస్తవులను హత్యలు చేస్తే కేంద్ర ప్రభుత్వం కనీసం న్యాయం చేయలేదన్నారు. రాజ్యాంగం కల్పించిన సెక్యూలిరిజం బిల్లును తుంగలో తొక్కి సిఏఏ చట్టాలను తీసుకువచ్చి స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు సంబంధించిన 23 సంక్షేమ పథకాలను ఎత్తివేసిందని దుయ్యబట్టారు. ఓటు అనే వజ్రాయుధాన్ని మాత్రం రాబోయే ఎన్నికల్లో ఉపయోగించి తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంతరం ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల నూతన కార్యవర్గమును వడ్లమూరి ఫ్రాన్సిస్ ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా జిఎస్.బాబు, ఎడిసి చైర్మన్‌గా జి.చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా పిఆర్.బాబు, ప్రెసిడెంట్ గా పి.రమణ, సెక్రటరీగా ఎంపీ.రావు. వైస్ ప్రెసిడెంట్‌గా డిఈ రావు, జాయింట్ సెక్రటరీగా పిఎస్ బాబు, ట్రెజరర్‌గా టి.దేముడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎల్ఎస్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్ఎన్.రాజు, పబ్లిసిటీ సెక్రటరీగా జేయస్.నారాయణ, కమిటీ మెంబర్స్‌గా కె.కళ్యాణం, వి.తలుపులు, కె.కుమారి, ఎన్ఎన్.రత్నం, సంధ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు



విద్యార్థులతో అధ్యాపకులు

గీతం టెక్ ఎక్స్‌పోలో యువ సాంకేతిక ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్క్వేర్‌ఆర్-24లో భాగంగా శుక్రవారం టెక్ఎక్స్పో నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల నూతన ఆలోచనలకు వేదికగా టెక్ ఎక్స్పో విశేషంగా ఆకట్టుకుంది. సెక్యూరిటీ అంశాలతో పాటు పంట పొలాలపై పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్‌లను విద్యార్థులు ప్రదర్శనలో ఉంచారు. ఆటోమొబైల్ పరిశ్రమలకు ఉపయోగపడే రీజనరేటివ్ బ్రేకింగ్ పరిజ్ఞానం, రోబోరేస్, ఐఒటి సహాయంతో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయ రంగంలో పంటలను క్రిమి కీటకాలు, పక్షుల నుంచి రక్షించే సాంకేతిక పరిజ్ఞానం, మిద్దె పంటలు, ఇస్రో రాకెట్, గార్డెనింగ్ ఐఒటి సహాయంతో ఏ విధంగా పర్యవేక్షించవచ్చో వంటి నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. సాంకేతిక యువజనోత్సవంలో భాగంగా విఎల్ఎస్ఐ డిజైన్, వెబ్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. యువజనోత్సవం ముగింపు వేడుకలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి. భరణిచంద్రకుమార్, ఐ స్క్వేర్ ఆర్ కన్వీనర్ బి. సెవెన్త్‌లైన్, ఫ్యాకల్టీ సలహదారులు డాక్టర్ పి.రాజు, ఎన్‌విఎస్‌వి. విజయకుమార్, డాక్టర్ ఎస్.శారదరాణి విజేతలకు బహుమతులు అందజేశారు.

నేతల ఫొటోలకు ముసుగులు

-అధికార పార్టీ రంగుల మార్పు
-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కోటవురట్ల: అడుగడుగున ఎన్నికల కోడ్ ఉల్లంగన అంటూ ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై అధికారులు శుక్రవారం స్పందించారు. ఉప తహసిల్దార్ అన్నాజీరావు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు సిబ్బందిని అప్రమత్తం చేశారు. మండల వ్యాప్తంగా వెంకటాపురం, చిన్న బొడ్డేపల్లి, పాములవాక, నీలుగుంట సహా మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ఫోటోలకు ముసుగులు వేయించారు. కటౌట్లను తొలగించారు. నీలిగుంట గ్రామంలో శిలా ఫలకాలను మూసివేసారు. పాములవాకలో జెండా రంగుతో ఉన్న సిమెంట్ బెంచీలకు రంగులు లేకుండా తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తొలగిస్తున్న నేతల పాటొ, మారుస్తున్న రంగులు

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి

ఐద్వా మ్యానిఫెస్టో ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:మహిళల అభ్యున్నతికిక వివిధ రాజకీయ పార్టీలకు కృషి చేయాలని నర్సీపట్నంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి డిమాండ్ చేశారు. మహిళా సాధికారిత, మద్యపాన నిషేధం, ఒంటరి మహిళలకు గుర్తింపు కార్డులు, భద్రత, ఉపాధి, బాలల సంక్షేమం తదితర విషయాలను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో రూపొందించిన మేనిఫెస్టోను శుక్రవారం ఐద్వా నాయకులు నర్సీపట్నంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ నాయకులు ఎల్.గౌరీ, కెవి.సూర్యప్రభ, ప్రసన్న, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మేనిపెస్టొను విడుదల చేస్తున్న ఐదా మహిళలు

వైసిపిలోకి పలువురు చేరిక


గొలుగొండలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో తెలుగుదేశం పార్టీ నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి 100 కుటుంబాలు శుక్రవారం చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ వీరికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, వివిధ శాఖల మంత్రిగా చేసిన అయ్యన్నపాత్రుడు చేపట్టిన అభివృద్ధి ఏమిటో, ఒక్కసారి ఎమ్మెల్యేగా చేసిన తన హయాంలో చేసిన కార్యక్రమాలపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. నర్సీపట్నంలో 150 పడకల ఆసుపత్రిను తీసుకు వచ్చానని చెప్పుకునే అయ్యన్నపాత్రుడు మాకవరపాలెం మండలంలో తాను తీసుకొచ్చిన మెడికల్ కాలేజీ కనిపించలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్ నాయుడు, ఏఎల్ పురం సర్పంచ్, అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, జడ్పిటిసి వెంకటగిరి బాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి సుర్ల ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని సుందరయ్య పేట, కోడూరు గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు సుమారు 100 మంది వైసిపిలో చేరారు. వారికి వైసిపి అనకాపల్లి నియోజకవర్గ అభ్యర్థి మలసాల భరత్ కుమార్ స్థానిక రింగ్ రోడ్‌లో పార్టీ కార్యాలయంలో శ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు పెద్దిశెట్టి గోవింద, మలసాల కిషోర్, మల్ల బుల్లిబాబు, బొడ్డేడ శివ, బొడ్డేడ లక్ష్మి నరసింహారావు, జాజుల రమేష్, దాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ: జివిఎంసి 58వ వార్డు కుంచాలమ్మ కాలనీకి చెందిన 25 టిడిపి కుటుంబాలు శుక్రవారం వైసిపిలో చేరాయి. నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో వైసిపి అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 58వ వార్డు కార్పొరేటర్ గులివెందల లావణ్య, క్లస్టర్ పార్టీ అధ్యక్షులు అంగారాం ప్రసాద్, పిల్లా కన్నబాబు, చుక్క వరలక్ష్మి, తోనంగి వెంకటరమణి, ధర్మాల వేణుగోపాల్ రెడ్డి, పిట్ట అప్పలరెడ్డి, సిరిపురం సత్యవతి, కోట సుబ్బలక్ష్మి, అయినవిల్లి రాంబాబు, ఉరుకుటి కన్నబాబు, తాడి సత్యానందం ఉన్నారు.

విశాఖకలెక్టరేట్: దక్షిణ నియోజకవర్గంలోని 39వ వార్డుకు చెందిన 50 మంది యువకులు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఆ వార్డు వైసిపి మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం, పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షులు ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఆశీల్‌మెట్టలోని వాసుపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది.

కుర్చీలను ఇస్తున్న పైడిరాజు

డిగ్రీ కళాశాలకు 30 కుర్చీల వితరణ

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 30 కుర్చీలు వితరణగా దాతలు అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పులవర్తి పైడిరాజు తన కుమారుడు యశస్విన్, కుమార్తె సాయిశ్రీ ల పుట్టినరోజును పురస్కరించుకొని 30 కుర్చీలను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన కుమారుడు, కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ, ఈ కుర్చీలను డిజిటల్ క్లాస్ రూమ్‌లో విద్యార్థులు కూర్చునేందుకు వినియోగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు డాక్టర్ పైడిరాజు ను అభినందించారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో ఈనెల 23వ తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుండి 6:00 వరకు, ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యుత్కు అంతరాయం ఏర్పడుతుందని స్థానిక విద్యుత్ శాఖ ఇంజనీరు మహేష్ తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ లో భాగంగా విద్యుత్తు నిలిపి వేస్తామని మండల వాసులు సహకరించగలరని ఈ సందర్భంగా కోరారు.

పైలా ను అభినందిస్తున్న కళావతి

పైలా గెలుపునకు కృషి

ప్రజాశక్తి-చీడికాడ:మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి పైలా ప్రసాదరావుని ఎంపిక చేయడంపై చీడికాడ మండలం మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కళావతి ఆధ్వర్యంలో ఖండివరం గ్రామంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పైలా ప్రసాదరావును కలిసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల్లో పైలా గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అరాచక పరిపాలనను, అన్యాయాలను ప్రజలకు వివరించి, టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు జురెడ్డి అప్పారావు, గుల్లిపల్లి వరాహమూర్తి, మాజీ వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్ట గొడుగులకు గిరాకీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని శుక్రవారం జరిగిన అరుకు వారపు సంతలో పుట్ట గొడుగులకు గిరాకీ ఏర్పడింది. పుట్టుగొడుగులు రుచికరంగా ఉండటంతో ఎగబడిమరీ కొనుగోలు చేశారు. పుట్ట గొడుగుల ఒక్కో కవరు రూ.100లకు గిరిజనులు విక్రయించారు. అరకులోయ మండలంలోని నడిమివలస గ్రామానిక చెందిన ఓ గిరిజనుడు సంతలో పుట్ట గొడుగులను తీసుకొచ్చి విక్రయించాడు. అతడు స్వయం ఉపాధికి ఇంటి సమీపంలో పుట్ట గొడుగుల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. కాపుకొచ్చిన పుట్ట గొడుగులను కవరులో రూ.100ల చొపున విక్రయించాడు. మన్యం పుట్ట గొడుగుల్లో పోషకాలు ఉండడంతో కొనుగోలు చేశారు.

విక్రయిస్తున్న గిరిజనుడు

సిఎఎపై సిపిఎం నిరసనలు

రద్దు చేయాలని డిమాండ్

మాడుగులలో నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:మత ప్రాతిపదికన రూపొందించిన సిఎఎను రద్దు చేయాలని శుక్రవారం నర్సీపట్నం రామారావుపేట కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, 1955 పౌరసత్వం చట్టాన్ని సవరణలు చేసి, పౌరసత్వం సవరణ చట్టం 2019ను తీసుకొచ్చారన్నారు. తీవ్రమైన ప్రజా వ్యతిరేకతతో ఐదేళ్ల పాటు నిలిపి, ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సిఎఎను మళ్లీ తెరపైకి తెచ్చారన్నారు. దీంతో, బిజేపి ఎన్నికలలో లబ్ధి పొందడానికి పూనుకుందన్నారు. పొరుగు దేశాలుండి వచ్చిన అన్ని మతస్తులకు పౌరసత్వం కల్పించడానికి అనుమతించి, కేవలం ముస్లిములకు వర్తించకపోవడాన్ని సిపిఎం ఖండిస్తుందన్నారు. ప్రస్తుతం ముస్లింలకు, రేపు మరో మతస్తులకు అవలంభిస్తారని విమర్శించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. స్వాత్వంత్రం పోరాటంలో దేశంలో ప్రజలందరూ కుల, మతలాకు అతీతంగా ఐక్యంగా పాల్గొన్నారని, ఐక్యంగా జీవిస్తున్నారన్నారు. రాజకీయ మనుగడుకు బిజేపి ఇటువంటి చర్యలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. ఈ బిజెపిని ఆంధ్రప్రదేశ్‌లో వైసిపీ, టిడిపి, జనసేన పార్టీలు నెత్తిన మోస్తున్నాయన్నారు. దేశంలో రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజల హక్కులకు పోరాడుతున్న ఇండియా కూటమిని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్.గౌరి, సత్తిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: సిఎఎ చట్టం అమలను అడ్డుకోవాలని స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా నాయకులు గండి నాయినిబాబు, మండల కన్వీనర్ ఇరట నరసింహమూర్తి, నాయకులు పి.సాంబశివరావు మాట్లాడుతూ, ముస్లిం మైనార్టీలను లక్ష్యం చేసుకుని ప్రకటించిన ఈ సీఏఏను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.ే పౌరుసత్వ చట్టం 1955 ప్రకారం దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి ఆ వ్యక్తి వారసులుగా ఉన్న వారు భారతీయుడేనని పేర్కొందన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని బలహీనపరిచే సిఏఏ చట్టం అమలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటలక్ష్మమ్మ

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్యతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎమ్.వెంకటలక్ష్మమ్మ అన్నారు. నక్కపల్లిలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షలు ఎలా రాస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన పరీక్షల్లో ఎంతమంది బాగా రాశారో అడిగి, వారిని అభినందించారు. పదో తరగతి అనంతరం ఆసక్తి ఉన్నదానిపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం నిర్దేశించుకుని, దాన్ని చేరేందుకు కృషి చేయాలని సూచించారు. పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏమీ ఉండదన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేష్, ప్రిన్సిపల్ సలీమ్, వైస్ ప్రిన్సిపాల్ వి.నాగలక్ష్మి ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న అనిత

వైసిపి పాలనలో రాష్ట్రం అంధకారం : టిడిపి

ప్రజాశక్తి- కోటవురట్ల:జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాలన రాష్ట్రాన్ని అందకారం లోకి నెట్టిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు అనిత విమర్శించారు. శుక్రవారం అన్నవరం గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని ప్రణాళిక పద్ధతిగా అభివృద్ధి చేసి పొందూరు, జల్లూరు వంతెన నిర్మాణాలు పూర్తి చేస్తానన్నారు. చక్కెర కర్మాగారాలకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీను, నర్సీపట్నం జడ్పిటిసి సభ్యురాలు శుకల రమణమ్మ, టిడిపి సీనియర్ నాయకుడు వేచలపు జనార్ధన్, యువ నాయకుడు తిరుమలరావు, ఎంపీటీసీ సభ్యులు ప్రకాష్, శ్రీను, బాబ్జి, ఏసు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

నక్కపల్లి:మండలంలోని బంగారమ్మపేట గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు.నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆమె స్వగృహంలో పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం ఏర్పడబోతుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం నుండి టీడీపీలో చేరిన ప్రతీ ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తైనాలను పరామర్శించిన ఎమ్మెల్యే వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మాజీ ఎమ్మెల్యే, వైసిపి సీనియర్ నాయకులు తైనాల విజయ్ కుమార్‌ను శుక్రవారం విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పరామర్శించారు. గురువారం సాయంత్రం ఆయన నివాసంలో జరిగిన దొంగతనం ఘటనపై చింతిస్తూ సానుభూతి తెలియజేశారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇకపై మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. తైనాల సతీమణి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, నగరం నడిబొడ్డులో ఉన్న ఇంటికి సాయంత్రమే రక్షణ లేకపోవడం పట్ల అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే పోలీసులు విచారణ జరిపి నిందితులను పట్టుకోవాలన్నారు. చోరీ సొత్తును రికవరీ చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే .. సిఎం జగన్ దిగజారుడు రాజకీయాలు

-టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు అనిత

మాట్లాడుతున్న అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి: ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత విమర్శించారు. నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్ లో ఆమె స్వగృహంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.టిడిపి హయాంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చేయడంలో మొదటి స్థానంలో ఉండగా డ్రగ్స్, మద్యం, గంజాయి ,ఆడ పిల్లలను అక్రమ రవాణాలో జగన్ ప్రభుత్వం లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. డ్రగ్స్ కంటైనర్ వైసిపి నేతకు చెందినదని, అతను విజయసాయి రెడ్డికి అతి సన్నిహితుడని తెలిపారు. కంటైనర్ తెరవకుండా అడ్డు పడాల్సిన అవసరం అధికారులకు ఏమి వచ్చిందని ప్రశ్నించారు. డ్రగ్స్ రవాణాపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడాలన్నారు. తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వాలంటీర్, వైసిపి నాయకులపై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేస్తానని, పరువు నష్టం వేస్తానని అనిత తెలిపారు. పాయకరావుపేటలో షాపింగ్ మాల్ ప్రారంభోత్స వంలో మాల్ యాజమాన్యం ను బెదిరించి 50 లక్షలు విలువైన చీరలు తీసుకు వెళ్లినట్లు, ఇదే కాకుండా యాజమాన్యం లక్ష రూపాయలు తనకు ఇచ్చినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకుడు, తునికి చెందిన వాలంటీర్‌పై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక టిడిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

ఉపాధి హామీ కూలీలకు సదుపాయాలు కల్పించాలి

సిపిఎం నేతల డిమాండ్

ప్రజాశక్తి- పెదబయలు :ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, సీతగుంట ఉపసర్పంచ్ బొండా గంగాధరం డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి కూలీల పని ప్రదేశాలలో సందర్శించారు. అనేక సమస్యలు వెలుగులో వచ్చాయి. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ, గతంలో పనిముట్లు, పారలు గుణపాలు సరఫరా చేసేవారని, నేడు కేంద్రం, రాష్ట్రంలో పరిపాలిస్తున్న పాలక పార్టీలు ఏమీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లు సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.పని ప్రదేశంలో కూలీలకు టెంట్లు, మంచినీరు, ప్రమాదవసత్తు దెబ్బ తగిలితే గాయాలు పాలైతే ప్రథమ చికిత్స మెడికల్ కిట్లు, కూర్చోడానికి తార్పాలిన్లు, పని ప్రదేశంలో చిన్న పిల్లలను చూసుకోవడానికి ఆలయాలు వంటి సౌకర్యాలు కానరాలేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. యూపీఏ ప్రభుత్వం వామపక్షాల పార్టీల పోరాట ఫలితంగా 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చింన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని సవరణ చేయాలని చూస్తుందని దుయ్యబట్టారు. ఈ చట్టంతో అనేకమంది పేదలకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఉపాధిని కూడా రద్దు చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్పందించి వేసవికాలంలో ఉపాధి కూలీల పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత సన్నిబాబు

కొత్తగా 4313 మంది ఓటర్ల నమోదు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలో 4313 మంది కొత్త ఓటర్లు నమోదు అయినట్లు తహశీల్దార్ నాగజోతి తెలిపారు.శుక్రవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, 2023 సవత్సరంలో 35541 ఓటర్లు ఉండగా కొత్తగా 4313 నమోదు అయ్యారని, మొత్తం ఓటర్ల సంఖ్య 36918 పెరిగిందన్నారు. ఓటర్లు ఈ సార్వత్రిక ఎన్నిలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాని సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి:రంజాన్ మాసాన్ని (పర్వ దినాన్ని) పురస్కరించుకుని మండల కేంద్రంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు స్థానిక ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 25 కేజీల బియ్యం, ఐదు కిలోల గోధుమపిండి, కేజీ నూనె, ఇతర నిత్యవసర సరుకులు గ్రామంలోని 15 నిరుపేద కుటుంబాలకు ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా, మజీద్ ఇమామ్ ఎండి ముజీబ్, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ఉప సర్పంచ్ నూరు బాబులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సరుకులు పంపిణీ చేయడంపై పలువురు ముస్లిములు సంతోషం వ్యక్తం చేశారు.